నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 | ఖమ్మం, శుక్రవారం 28 జూన్ 2024 | KHAMMAM

కేసీఆర్ కల నెరవేరింది..

మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

మాజీ ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేట/దమ్మపేట, జూన్ 27 : సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతం కావడంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల సాకారమైందని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. గురువారం అశ్వారావుపేట, దుమ్మపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు 'నా గుండె కాయ' అని ఆనాడే నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని, ఈ క్రమంలో ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్ జిల్లాలోని సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కేసీఆర్ మదిలోంచి జాలువారిన ప్రాజెక్టు సీతారామ అని పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైతులు మూడు పంటలు పండించుకోవచ్చని కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. కరువును శాశ్వతంగా పారదోలే వరప్రదాయినికి కేసీఆర్ ప్రాణం పోశారని, పరవళ్లు తొక్కే గోదావరి జలాలతో రైతుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండుతాయని అన్నారు. కేసీఆర్ కలను సాకారం చేసే జల సంకల్ప విజయంలో భాగస్వాములైన అధికారులు, సిబ్బందికి మెచ్చా అభినందనలు తెలిపారు.

అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ వద్ద ట్రయల్ రన్‌లో భాగంగా పరవళ్లు తొక్కుతూ ముందుకు దుంకుతున్న గోదావరి జలాలు

కేసీఆర్ స్వప్నం.. సాకారం

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి పరవళ్లు.. రైతన్నకు సాగునీళ్లు..
- లక్షల ఎకరాలకు సాగునీరు అందించే 'సీతారామ' ట్రయల్ రన్ సక్సెస్
- కరువును పారదోలే కల్పతరువైన 'సీతారామ'ది బీఆర్ఎస్ సర్కారు ఫలితమే..

సీతారామ ప్రాజెక్టుకు భూమిపూజ చేస్తున్న అప్పటి సీఎం కేసీఆర్ (ఫైల్)

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, జూన్ 27 : స్వరాష్ట్ర ఉద్యమసారథి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రస్తుత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వప్నం సాకారమైంది. అపర భగీరథుడిగా ఆయన అంకురార్పణ చేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన సాగునీటి ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతమైంది. దీంతో ఉమ్మడి జిల్లా ప్రజలందరూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రైతు బాంధవుడైన కేసీఆర్.. అన్నదాతల కోసం అపర భగీరథుడయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు 'సీతారామ' పేరిట గోదావరిపై ఎత్తిపోతల పథకానికి 2016 ఫిబ్రవరి 16న శ్రీకారం చుట్టారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో రూ.17 వేల కోట్ల అంచనాలతో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బృహత్తర సాగునీటి పథకాన్ని చేపట్టారు. అప్పటి నుంచి దాని పనులు వివిధ దశల్లో కొనసాగుతూ ఇటీవలే ముగింపు దశకు వచ్చాయి. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని తన గొప్పగా చెప్పుకుంటోంది. ఈ క్రమంలో గురువారం జిల్లాకు వచ్చిన నలుగురు మంత్రులు.. కనీసం వ్యూ పాయింట్ నుంచి కూడా ప్రాజెక్టును పరిశీలించలేదు. అది ఎక్కడ ఉందో, ఎలా పనిచేస్తుందో గమనించలేదు. కేవలం సీతమ్మబరాజ్‌ను, కాలువను పరిశీలించి వెళ్లారు. ఈ ప్రాజెక్టు పనుల్లో తట్టెడు మట్టి కూడా పోయని నేటి కాంగ్రెస్ పాలకులు.. ఈ ప్రాజెక్టు ఘనత అంతా తమదేనని చెప్పుకుంటుండడంతో జిల్లా ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. కరువును పారదోలే కల్పతరువైన ఈ సీతారామ ప్రాజెక్టు ఫలితమంతా గత కేసీఆర్ ప్రభుత్వానిదేనంటూ చర్చించుకున్నారు.

లక్షల ఎకరాలకు సాగునీరందించేలా..

భవిష్యత్ తరాలకు సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యేందుకు గత కేసీఆర్ సర్కారు ముందు చూపుతో ఈ ప్రాజెక్టుకు పునాది వేసింది. 2016 ఫిబ్రవరి 18న జీవో నెం 72 ద్వారా రూ.7,926 కోట్ల నిధులను మంజూరు చేసింది. తర్వాత దశల వారీగా నిధులు మంజూరు చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్ జిల్లాకు కూడా నీరందించేందుకు పనులు చేపట్టింది. మూడు జిల్లాల్లో కలిపి మొత్తంగా 6,74,387 ఎకరాలను సాగులోకి తెచ్చేందుకు శ్రమించింది. దశల వారీగా పనులన్నీ పూర్తి చేసింది. ట్రయల్ రన్ వేయడమే తరువాయి అనుకున్న సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కానీ కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు మాత్రం తమ పాలనలోనే సీతారామ పూర్తయిందంటూ గప్పాలు చెప్పుకొని ట్రయల్ రన్ పూర్తి చేసింది.

గోదావరి పరవళ్లు.. రైతన్నకు సాగునీళ్లు..

గోదావరిపై ప్రాజెక్టు నిర్మించి ఇక్కడి బీడు భూములను సాగులోకి తేవాలన్న ఉద్యమసారథి సంకల్పం నెరవేరబోతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల పాలిట కల్పతరువు కాబోతోంది. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద ఉన్న బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్టు అందుబాటులోకి రాబోతోంది. గోదావరి పరవళ్లతో రైతున్నకు సాగునీళ్లు అందబోతున్నాయి.

'సీతారామ' ఘనత కేసీఆర్‌దే..

- కేంద్రంతో కొట్లాడి అనుమతులు తెచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- సీతారామ ట్రయల్ రన్ విజయవంతం జిల్లాకు శుభసూచకం
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు టౌన్, జూన్ 27 : ఉమ్మడి ఖమ్మం జిల్లాను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయాలని సంకల్పించి సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకానికి పూనుకున్న ఘనత కేసీఆర్‌దేనని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం సీతారామ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ విజయవంతం కావడం పట్ల ఉమ్మడి జిల్లా రైతాంగానికి, ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ కట్టాలని గత ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పించినా.. అనేక కేసులు పెట్టి ఆటంకం కలిగించారని ఆయన గుర్తు చేశారు. అయిప్పటికీ కేంద్ర ప్రభుత్వంతో పోరాడి అన్ని అనుమతులు మంజూరు చేయించారని, 90 శాతం పనులు పూర్తి చేయించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే మొదటిసారి డ్రై రన్ నిర్వహించామని గుర్తు చేసిన ఆయన సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ సహా మొత్తం 6,75,000 పైచిలుకు ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఒకపక్క కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తూనే.. మరోవైపు సీతారామ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రాజెక్ట్ పనులను నిలిపివేయడానికి అప్పటి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య కాంగ్రెస్ కార్యకర్త తెల్లం నరేశ్‌తో కోర్టులో కేసు వేయించారని గుర్తు చేశారు. గురువారం జిల్లా పర్యటనకు ముగ్గురు మంత్రులు వచ్చినా ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. తట్టెడు మట్టి పోయనోళ్లు.. దమ్ముంటే సీతారామ ప్రాజెక్టు మీద ఎంత ఖర్చు పెట్టారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రూపాయి ఖర్చు పెట్టకుండా స్విచ్ ఆన్ చేసిన మంత్రి తుమ్మల 'నా కల నెరవేరింది' అని చిలక పలుకులు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దమ్ముంటే ప్రాజెక్ట్ పూర్తి చేయండి అంటూ ఆయన జిల్లా ప్రజల పక్షాన డిమాండ్ చేశారు.

సీతారామ ట్రయల్ రన్ సక్సెస్

- అధికారులతో కలిసి ప్రారంభించిన మంత్రి తుమ్మల
- సస్యశ్యామలం దిశగా ఉమ్మడి జిల్లా అడుగులు


టయల్ రన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వాపురం, జూన్ 27 : సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద నిర్మించిన పంప్‌హౌస్ ట్రయల్ రన్ విజయవంతమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీడు భూములను సస్యశ్యామలం చేయాలని.. రైతులు రెండు, మూడు పంటలు పండించుకోవాలనే ఉద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఎత్తిపోతల పథకం మొదటి దశ పంప్‌హౌస్ ట్రయల్ రన్‌ను గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. సంబంధిత శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లోనే వైరా రిజర్వాయర్ వరకు గోదావరి జలాలను పారిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కుమ్మరిగూడెం వద్ద నుంచి తొమ్మిది కిలోమీటర్లు గ్రావిటీ ద్వారా బీజీ కొత్తూరు పంప్‌హౌస్ వరకు చేరనున్న గోదావరి జలాలు ఎత్తిపోతల ద్వారా ఒక్కసారిగా పరవళ్లు తొక్కడంతో చూపరులకు కనువిందు చేసింది. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీరు ఆక్షేపణీయం

పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకమంటూ మ్యానిఫెస్టోలో పెట్టారు ఇప్పుడు అందుకు భిన్నంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొంటున్నారు తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణిని ప్రైవేటుపరం కానివ్వం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర సహచర రాజ్యసభ సభ్యులతో కలిసి ఢిల్లీలో విలేకరుల సమావేశం

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌తో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు

ఖమ్మం, జూన్ 27:తెలంగాణలో కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమని రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. పార్టీ ఫిరాయింపులకు వారి పార్టీ వ్యతిరేకమంటూ మ్యానిఫెస్టోలో పెట్టుకున్న హస్తం పార్టీ.. ఇప్పుడు అందుకు భిన్నంగా, అప్రజాస్వామికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తోందని దుయ్యబట్టారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్రహించబోమంటూ చెప్పిన ఆ పార్టీ.. ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తుండడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. ఈ పద్ధతికి కాంగ్రెస్ వెంటనే స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కేఆర్ సురేశ్‌రెడ్డి, సహచర రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డితో కలిసి ఢిల్లీలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రవిచంద్ర మాట్లాడారు. తెలంగాణలోని పాలమూరు – రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణి.. తమ రాష్ట్రానికిదే గొప్ప ఆదాయవనరని అన్నారు. దానిని ప్రైవేటుపరం చేసేందుకు తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. గనుల పరిరక్షణ కోసం తమ నాయకుడు కేసీఆర్ నేతృత్వంలో ఇకముందు కూడా పోరాడుతామని తేల్చిచెప్పారు. కేంద్ర గనుల శాఖ మంత్రిగా ఉన్న తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి.. తగు చొరవ తీసుకోవాలని కోరారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పేలా వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని బయ్యారంతోపాటు దాని పొరుగునే ఉన్న ఛత్తీస్‌గఢ్ బైలడిల్లాలో ఇనుప ఖనిజం సమృద్ధిగా ఉందని అన్నారు. దానిని సద్వినియోగం చేసుకుంటూ ఉక్కు కర్మాగారం నెలకొల్పితే తెలంగాణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. అలాగే కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కూడా ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం, తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్రమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామ్మోహన్‌నాయుడు, చంద్రశేఖరరావులకు వద్దిరాజు శుభాకాంక్షలు తెలిపారు.

రాజ్యసభ చైర్మన్‌తో సమావేశం..

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌తో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ సురేశ్‌రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి తదితరులు గురువారం ఢిల్లీలో సమావేశమయ్యారు.

చదువుల్లో మెరికల్లా తీర్చిదిద్దాలి

జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

సత్తుపల్లి, జూన్ 27 : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినీ విద్యార్థులను చదువుల్లో మెరికల్లా తీర్చిదిద్దాలని, ఆ బాధ్యత ఉపాధ్యాయులదేనని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. గురువారం కల్లూరులోని బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ఊరు–మన బడి కింద మండలంలోని కొన్ని పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, వాటిపై శ్రద్ధ పెట్టి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే తరగతి గదులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారని ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ బీరవల్లి రఘు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, ఎంఈవో దామోదరప్రసాద్, హెచ్ఎం పద్మ, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, దార్ల నర్సింహారావు, అఫ్రోజ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి: ఏసీ

మామిళ్లగూడెం, జూన్ 27: కూసుమంచి మండలం పాలేరులోని బీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ (ఏసీ) మధుసూదన్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర యువజన సర్వీసులు, టీజీఎస్‌టీఈపీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం10 గంటలకు ఈ జాబ్‌మేళా ప్రారంభమవుతుందని అన్నారు. ఏ విద్యార్హతలూ లేని వారి నుంచి మొదలుకొని పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకూ విద్యార్హతలు ఉన్నవారందరూ ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని అన్నారు. ఫార్మా, ఐటీ, మార్కెటింగ్ సహా వివిధ విభాగాల్లో ఉన్న పలు ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం 65 కంపెనీలు సుమారు ఐదు వేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. నిరుద్యోగ యువతీ యువకులు https://forms.gle/aWH1uo5poS6RrT3D6 లింక్ ద్వారా గానీ, క్యూఆర్ కోడ్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 8886711991, 9642333668 నంబర్లను సంప్రదించాలని కోరారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయండి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

బోనకల్లు, జూన్ 27 : ఉద్యోగోన్నతుల అనంతరం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించి మిగిలిన పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జానకీపురం, రావినూతల, బోనకల్లు ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేసి పాత విధానాన్నే కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు స్కావెంజర్‌ను నియమించాలని, విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లిష్‌లో మాట్లాడే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. విద్యారంగ బలోపేతానికి ఉపాధ్యాయులతోపాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావా దుర్గారావు, జిల్లా నాయకులు రమాదేవి, వల్లంకొండ రాంబాబు, సదాబాబు, ఎస్.వీరబాబు, బోనకల్లు మండల అధ్యక్షుడు బీ.ప్రీతం, ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, లెనిన్‌స్టన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో 'వాల్' పూర్తి చేయాలి

నీటిపారుదల శాఖ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ దేవేందర్‌రెడ్డి

మున్నేరు ఆర్‌సీసీ వాల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు

పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ దేవేందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, జూన్ 27 : మున్నేరు పరీవాహక ప్రాంతంలో నిర్మిస్తున్న ఆర్‌సీసీ వాల్ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ క్వాలిటీ కంట్రోల్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) దేవేందర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని మున్నేరు వాగు పరీవాహక ప్రాంతంలో చేపట్టిన ఆర్‌సీసీ వాల్ నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ ఈఈ వెంకటరమణారావు, ఐబీ ఈఈ మంగళపుడి వెంకటేశ్వర్లుతో కలిసి గురువారం పరిశీలించారు. తొలుత నిర్మాణ పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించిన అనంతరం క్షేత్రస్థాయిలో పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ భారీ వర్షాలతో వరద ఉధృతి నుంచి తట్టుకునే విధంగా మున్నేరు వాగుకు ఇరువైపులా చేపట్టిన ఆర్‌సీసీ వాల్ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. ఖమ్మం నగరం వైపు 8.5 కిలోమీటర్లు, రూరల్ మండలం వైపు 8.5 కిలోమీటర్ల పొడువున వాల్ నిర్మాణం జరుగుతుందన్నారు. 33 అడుగుల పొడవు ఉండే వాల్ నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుత నిర్మాణ పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే భారీ వరదలు రాకమందే అందుకనుగుణంగా నిర్మాణాలు జరగాలన్నారు. కార్యక్రమంలో ఐబీ డీఈలు రమేశ్‌రెడ్డి, మన్మథరావు, చంద్రమోహన్, ఏఈలు ఏడుకొండలు, మహేశ్, మన్‌దీప్, అరుణ, రమాదేవి, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకెళ్దాం

- పక్కా కార్యాచరణతో వరదలను ఎదుర్కోవడం సులువే..
- ప్రాణ నష్టం, ప్రమాదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అంకితభావంతో పనిచేయాలి.. ప్రజల మన్ననలు పొందాలి
- వరదల సంసిద్ధత సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

వరదల సంసిద్ధత సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, పొంగులేటి, ఎమ్మెల్యేలు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27 (నమస్తే తెలంగాణ) : వరదలు ఏజెన్సీకి కొత్త కాదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గుర్తు చేశారు. కానీ.. పక్కా కార్యాచరణతో వరదలను ఎదుర్కోవడం సులువేనని అన్నారు. ఇందుకోసం ప్రభుత్వ యంత్రాంగమంతా కలిసి పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్దామని సూచించారు. 'వరదల సంసిద్ధత–సహాయక చర్యల'పై భద్రాద్రి కొత్తగూడెంలోని ఐడీవోసీలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మంత్రులతో కలిసి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వానకాలంలో ఏటా వచ్చే గోదావరి వరదల వల్ల జిల్లాలోని కొన్ని మండలాలకు ఎక్కువ ముప్పు ఉండేదని, అయితే ముంపు మండలాలు ఆంధ్రా పరిధిలోకి వెళ్లాక భద్రాచలం డివిజన్‌కు పెద్దగా ముప్పు ఉండడం లేదని అన్నారు. మరీ ఎక్కువ వరద వస్తే మొత్తంగా 111 గ్రామాలు జలదిగ్బంధంలో ఉంటాయన్నారు. భద్రాచలం పట్టణానికి ఎప్పుడూ ముంపు ఉండదని, కరకట్ట వద్ద ఉన్న స్లూయిజ్ కాలువల వల్లనే పట్టణంలోకి వరద వెళ్తుందని అన్నారు. ఇందుకోసం ముందస్తుగా గేట్లకు మరమ్మతులు చేయించుకోవాలని, మోటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. దుమ్ముగూడెం, పర్ణశాల, చర్ల, సారపాక, బూర్గంపహాడ్, మణుగూరు ప్రాంతాల్లో కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని వివరించారు. కండీషన్‌లో ఉన్న లాంచీలను, పడవలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వచ్చే మూడు నెలలు వరదల సమయమైనందున నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. దాదాపుగా అధికారులందరికీ వరదల సమయంలో పని చేసిన అనుభవం ఉన్నందున ఎవరో వస్తారని, ఏదో చేస్తారని అనుకోకుండా అధికారులే సత్వర ఆలోచనలతో ముంపులో ఉన్న ప్రజలను సురక్షితంగా బయటకు చేర్చాలని సూచించారు. వరదలను ఎదుర్కొనేందుకు ఎంత ఖర్చయినా వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. అధికారులు కూడా అంకితభావంతో పనిచేయాలని, ప్రజల మన్ననలను చూరగొనాలని ఆకాంక్షించారు.

అందరూ యువ అధికారులే..: మంత్రులు

జిల్లాలో పనిచేసేవారంతా యువ అధికారులేనని ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇటీవలే వచ్చిన కలెక్టర్‌తోపాటు ఎస్పీకి, ఐటీడీఏ పీవో, ఇతర జిల్లా అధికారులకు అపారమైన అనుభవం ఉందని అన్నారు. అందరి ఆలోచనలనూ పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. పాలనా యంత్రాంగమంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, జారె అదినారాయణ, కోరం కనకయ్య, రాందాస్‌నాయక్, జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, ఎమ్మెల్సీ మల్లన్న, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఎఫ్‌వో కిష్టాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.